16

# ఆదేశములు మరియు ప్రశంసలు

## కొలొస్సయులకు 4:7-9

ఆయన సంఘములకు వ్రాసిన ఉత్తరములను, పౌలు తన తుది ఆదేశములతోను కొన్ని పర్యాయములు తన తోటి పనివారి అభివందనములతోను వాటిని ముగించాడు. కొలొస్సయులకు వ్రాయబడిన పత్రికలో ఆయనతో కూడ ఉండిన వారికి సంబంధించిన సర్వసాధారణమైన వాటి కంటే వ్యక్తిగత ప్రస్తావనలు మరియు ప్రశంసలు ఎక్కువగా ఉండినవి. తన ఉత్తరమును మోసికొని వెళ్లినవారును తనకు వ్యక్తిగత వార్తాహరులుగా ఉండినవారు, తుకికు మరియు ఒనేసిమును పౌలు మొదలగువారిని పేర్కొనుచు ప్రశంసించాడు (వచనాలు 7-9). అటుతరువాత ఆయన కొలొస్సీ సహోదరులకు వారి అభివందనములు పంపిన మరి ఆరుగురు సహచరుల పేర్లను పేర్కొన్నాడు (వచనాలు 10-14). ఆయన లవొదికయ సంఘమునకు తన అభివందనములు పంపాడు, ఆ తరువాత నుంఫాకును ఆమె ఇంటిలో నున్న గృహ కూడికకును, వెనువెంట అర్ఖిప్పునకు ఒక మందలింపును పంపాడు (వచనాలు 14-17). కొలొస్సయులకు తన వ్యక్తిగత అభివందనములను తెలియజేయుచు పౌలు తన పత్రికను ముగించాడు (వచనము 18).

ఆయన గాని, ఆయనతో కూడ నుండిన సహచరులుగాని, హెచ్చింపబడిన నాయకులు లేక వరుస క్రమములో ఇతర క్రైస్తవుల కంటె పరిశుద్ధులైయున్నందునుబట్టి వారు పూజింపబడుచు గౌరవింపబడవలసిన వారును విజ్ఞులైన ఉన్నతాధికారులునై యున్నారని పౌలు తనను తాను మరియు తన సహచరులను వర్ణించలేదు. మానవులను హెచ్చించకూడదని యేసు చెప్పాడు (మత్తయి 23:6-12). ఇతరులకు పరిచారము చేయువాడే తన శిష్యులలో అందరి కంటె గొప్పవాడై యున్నాడని ఆయన సెలవిచ్చాడు. వారు విశ్వాసులైన దాసులనియు, తోటి దాసులనియు, కట్టుబడియుండిన దాసులనియు ఆయనతో కూడ పాటుపడిన వారిని పౌలు వర్ణించాడు (1:7; 4:7, 12). పౌలు తన యెడలను తనతో కూడ ప్రయాసపడుచుండిన ఆయన తనను తాను గుర్తించుకొన్నాడు; ఆయన తన పేరుకు ఒక ప్రత్యేకమైన బిరుదును పెట్టుకొనలేదు లేదా ఆయన వారి కంటె ఉన్నతమైనవాడని స్వాధికార స్వరంతో చెప్పుకొనలేదు.

### తుకికుతో సంబంధము పెంచుకొన్నాడు (4:7, 8)

**[7]ప్రియసహోదరుడును, ప్రభువునందు నమ్మకమైన పరిచారకుడును, నా తోడి సేవకుడునైన తుకికు నన్ను గూర్చిన సంగతులన్నియు మీకు తెలియజేయును. [8]మీరు మా స్థితి తెలిసికొనునట్లును మీ హృదయములను అతడు ఆదరించునట్లును, అతనిని అతనితో కూడ నమ్మకమైన ప్రియసహోదరుడైన ఒనేసిమును మీ యొద్దకు పంపుచున్నాను; ఇతడు మీ**

**యొద్దనుండి వచ్చినవాడే; వీరిక్కడి సంగతులన్నియు మీకు తెలియజేతురు.**

**"ప్రియ సహోదరుడను, ప్రభువునందు నమ్మకమైన పరిచారకుడును,**
**నా తోడి సేవకుడునైన తుకికు నన్ను గూర్చి సంగతులన్నియు**
**మీకు తెలియజేయును" (4:7)**

పౌలు వ్రాసిన ఉత్తరమును కొలొస్సయులకు అందజేయుటకు ఇద్దరు వార్తాహరులు ఏర్పాటుచెయబడ్డారు – ఒకడు స్వతంత్రుడు, **తుకికు,** మరొకడు ఒక దాసుడు, ఒనేసిము. ఒక్కని కంటే ఇద్దరు కలిసి క్షేమకరంగా ప్రయాణమై వెళ్లవచ్చును. ఇంకా, పౌలు పరిస్థితి గూర్చి ఒక్కని కంటె ఇద్దరు మరి ఎక్కువ మరియు సంపూర్ణమైన వివరాలు తెలియజేయగలరు. పౌలుకును ఈ ఇరువురికిని మధ్య నెలకొని యుండిన అనురాగసహితమైన అన్యోన్య అనుబంధము ఈ వార్తాహరులను పౌలు గూర్చిన వార్తలను అందించు మంచి వాహకులను చేసినది.

"అదను" లేక "యాదృచ్ఛికము" అని అర్థమిచ్చు తుకికు, పౌలు సహచరులలో అంతగా సుపరిచితమైనవాడు కాదు మరియు ఈయన ఆసియా మైనరు ప్రాంతమునకు చెందినవాడు. లూకా మొదటిసారి ఈయనను అపొస్తలుల కార్యములు 20:4లో పేర్కొన్నాడు. కానీ ఈయన పౌలుతో ఎక్కడ లేక ఎప్పుడు చేరాడో బయలుపరచలేదు. స్పష్టంగా, పౌలు తన మూడవ మిషనరీ ప్రయాణము ముగించుకొని మాసిదోనియ గుండా తిరిగి వచ్చుచుండగా ఈయన పౌలుతో కూడ ఉన్నాడు. ఈయన సోపత్రు, అరిస్తార్కు, సెకుందు, గాయు, మరియు తిమోతితో కూడ పౌలు మరియు లూకా కంటె ముందుగానే అసియా మైనరులోని త్రోయకు ప్రయాణమై వెళ్లాడు. తన మూడవ మిషనరీ ప్రయాణము ముగించుకొని మాసిదోనియ గుండా వెళ్లిన తరువాత, పెంతెకోస్తు దినము కంటె ముందుగానే యెరూషలేమునకు చేరుకొనవలెనని తీర్మానించుకొని (అపొస్తలుల కార్యములు 20:16), యెరూషలేములోని సంఘము కొరకైన ద్రవ్యమును వారికి అందజేయుటకు పౌలు తుకికును మరియు ఇతరులను కొందరిని తనతో తీసుకొని వెళ్లాడు. యెరూషలేములో పేదలైన వారి నిమిత్తము పౌలు పోగుచేయుచుండిన నిధులను వారి యొద్దకు తీసుకొనివెళ్లుటకు తుకికు, తీతుతో కూడ పంపబడినవారిలో యితడు ఎంతో నమ్మకమైన సహోదరుడని కొంతమంది వ్యాఖ్యాన కర్తలు అంటారు (అపొస్తలుల కార్యములు 24:17; 1 కొరింథీయులకు 16:3; 2 కొరింథీయులకు 8:16–19 చూడుము).

పౌలు ఈ ఉత్తరమును వ్రాసినప్పుడు, ఆయన రోమాలోని చెరసాలలో మొదటిసారి ఉంచబడినప్పుడు తుకికు ఆయనతో కూడ ఉన్నాడు (ఎఫెసీయులకు 6:21). పౌలు రెండవసారి చెరసాలలో వేయబడిన సమయంలో కూడ తుకికు పౌలుతో ఉన్నాడు (2 తిమోతి 4:12; తీతు 3:12). తుకికు రోమాలో పౌలుతో కూడ నుండునట్లు ఎలా లేక ఎప్పుడు ప్రయాణమై వెళ్లాడో లూకా చెప్పలేదు.

పౌలు తుకికును బహు గొప్ప గౌరవముతో కూడిన ఆదరాభిమానములతో చూసాడు, గనుక **మా ప్రియమైన సహోదరుడును నమ్మకమైన పరిచారకుడును తోటి దాసుడును** మరియు "ప్రియ సహోదరుడును ప్రభువునందు నమ్మకమైన పరిచారకుడు" అని తుకికు గూర్చి ప్రస్తాపించుచున్నాడు (ఎఫెసీయులకు 6:21). పౌలు తరుచుగా తోటి క్రైస్తవులను

"సహోదరులు" అని సంబోధించాడు (1:1, 2; 4:7, 9, 15; 1:1పై వ్రాయబడిన చర్చను చూడుము).

ఈ పత్రికలో పౌలు, తుకికు (4:7); ఇంకా ఇతర నలుగురు - ఎపఫ్రా (1:7), ఒనేసిము (4:9), మరియు లూకా (4:14); మరియు యేసు (1:13) గూర్చి ప్రస్తావించుచు "ప్రియమైన" అను పదమును ప్రయోగించుచున్నాడు. ఒకనికి ఇతరుల కంటె మరి ఎక్కువ ఇష్టపూర్వకంగా ప్రేమింపబడువారుండుట పొరపాటేమో అని క్రైస్తవులు కొన్ని పర్యాయములు ఆశ్చర్యపడుచుందురు. స్పష్టముగా, ఇలాటి వారు పౌలుకుండినవారు, అలాగే మన ప్రభువైన యేసుక్రీస్తుకు కూడ ఉండినారు. (ఇది ఆయన అపొస్తలుడైన యోహాను యెడల ప్రదర్శించిన ప్రేమ ద్వారా విదితమగుచున్నది; యోహాను 20:2; 21:7, 20.)

తుకికు ఒక్కడు మాత్రమే పౌలు చేత "నమ్మకమైన పరిచారకుడు" (*pistos diakonos*) అని సంబోధింపబడినాడు. "నమ్మకమైన" అనగా, "ఆధారపడదగిన" మరియు "అంకితము చేసికొనిన" అని అర్థము.

ఒక నమ్మకమైన అంతరంగిక దూతగా, అతడు తన ఉత్తరమును నమ్మకంగా అందజేస్తాడని అతనియందు పౌలుకుండిన నమ్మకమును తుకికు నిలబెట్టుకొన్నాడు (ఎఫెసీయులకు 6:21). పౌలు ఆ రోజుల్లో నేడు అందుబాటులో అనుకూలంగా నున్న ఆధునిక తపాలా సౌకర్యములు లేవు, గనుక ఆయన తన ఉత్తరములను మోసుకొని వెళ్లుటకు ఆధారపడదగిన వ్యక్తులపై ఆధారపడ్డాడు. కొంత కాలమైన తరువాత, పౌలు తుకికును ఎఫెస్సుకు పంపాడు. అచ్చట పరిచర్య చేయుచుండిన తిమోతికి బదులుగా పరిచర్య కొనసాగించుటకు లేదా తిమోతికి సహాయము చేయుటకు అని స్పష్టమగుచున్నది (2 తిమోతి 4:12). క్రేతులో పరిచారము చేయుచుండిన తీతు స్థానంలోనికి తుకికు గాని లేదా అర్తెమా గాని వెళ్లవలెననియు, అప్పుడు తీతు నికోపొలిలో పౌలుతో కూడ శీతాకాలము గడుపుటకు వెళ్లగలడనియు పౌలు ప్రణాళిక వేసుకొన్నాడు (తీతు 3:12).

"దాసుడు" (*diakonos*) అను పదమును "పరిచారకుడు" మరియు "డీకను" అని అనువదింపవచ్చును. డీకను అందించు సేవల గూర్చిన అవగాహనతో పౌలు ఈ పదమును సాంకేతిక దృష్టికోణంలో మూడుసార్లు ప్రయోగించాడు (ఫిలిప్పీయులకు 1:1; 1 తిమోతి 3:8, 12). అలా కానట్లయితే, ఇచ్చట, దాని అర్థము, పరిచారము చేయుటకు ఏ సామర్థ్యములోనైనను ఒక అవకాశము కల్పింపబడినప్పుడు అతడు దానిని నమ్మకముగా నిర్వర్తించాడని పౌలు చెప్పుచుండవచ్చును.

"కట్టుబడియుండిన దాసుడు" (*sundoulos*) అను పదమును పౌలు ఎపఫ్రాకు *sun* "తో," మరియు *doulos*, "బానిస" ఈ పదమును యేసు ప్రయోగించాడు (మత్తయి 18:28; 24:49 చూడుము), అటువలెనే యోహాను కూడ ఉపయోగించాడు (ప్రకటన 6:11; 19:10; 22:9). ఆయన తానే యేసు దాసుడై యుండెనని పౌలు తనను గూర్చి తాను ఎంచుకొన్నాడు గనుక తుకికును ప్రభువునందలి తన తోటి దాసునిగా దృష్టించాడు. ఇతర క్రైస్తవులతో సహా, పౌలు మరియు తుకికు యేసు సిలువపై చిందించిన రక్తముచేత కొనబడినవారై యున్నారు; తద్వారా వారు ఆయనకు కట్టుబడిన దాసులై యుంటున్నారు.

"ప్రభువు నందు" అను పదము యొక్క అర్థము అదే అయినప్పటికిని పౌలు దానిని "క్రీస్తు నందు" అను పదము కంటె తక్కువ సార్లు ఉపయోగించాడు (1:2, 4, 28; 2:5

చూడుము). తుకికు "ప్రభువు నందు" ఉండినవాడు గనుక, అతడొక నూతన సృష్టియై యుండెను, ఒక్క శరీరము, సంఘము, విశ్వాసుల సమాజములో సభ్యుడై యుండెను. తుకికు కేవలము ఆయనతో కూడ ప్రయాణం చేయుచు పరిచర్య చేయుట మాత్రమే కాదు, కానీ అతడొక తోటి విశ్వాసియై యుండెనని కొలొస్సయులు తెలిసికొనునట్లు పౌలు ఈ తారతమ్యమును చూపించాడు.

**"మీరు మా స్థితి తెలిసికొనునట్లును మీ హృదయములను అతడు ఆదరించునట్లును,**
**అతనిని అతనితో కూడ నమ్మకమైన ప్రియసహోదరుడైన ఒనేసిమును**
**మీ యొద్దకు పంపుచున్నాను; ఇతడు మీ యొద్దనుండి వచ్చినవాడే;**
**వీరిక్కడి సంగతులన్నియు మీకు తెలియజేతురు" (4:8, 9)**

పంపుచున్నాను (*epempsa*) అను పదమును పూర్తిచేయబడిన ఒక కార్యమును తెలియజేయుచున్నది. తన పత్రికను చదువువారి దృష్టికోణంలో పౌలు దీనిని వ్రాయుచుండెను. "నేను పంపించుచున్నాను" అని వర్తమాన కాలమును తెలియజేయు పదజాలమును పౌలు ఉపయోగించి యుండవచ్చును; కానీ గ్రహీతలు ఈ ఉత్తరమును చదువునప్పటికే తుకికు కొలొస్సీలో ఉండియుండును. ఈ హేతువునుబట్టి, పౌలు తన సొంత దృక్పథమునకు బదులుగా వారి దృష్టికోణంలో వ్రాసాడు.

అతడు (వారి) హృదయములను ఆదరించుట తుకికు రాకడలోని ఉద్దేశములలో ఒకటై యుండెను. "ఆదరించుట" (*parakaleō*) – ఒక సంయుక్త క్రియా పదమై యున్నది, *para*, "తో," మరియు *kaleō*, "పిలుచుట," అను పదములు కలయికపై యున్నది. ప్రక్కలో నిలిచియుండునట్లు, అనగా, బలముగా బ్రతిమలాడునట్లు, ఎవరో ఒకరిని పిలుచుట అనునది దాని మౌలిక భావమై యున్నది (అపొస్తలుల కార్యములు 16:39; 28:20; రోమీయులకు 12:1; 1 కొరింథీయులకు 1:10). మనస్సుల్లోనికి నిర్భయమును లేక ఆదరణను చొప్పించుట, ప్రోత్సాహము నిచ్చుట అని ఈ పదము సూచించవచ్చును (2 కొరింథీయులకు 1:4; 7:6; కొలొస్సయులకు 2:2; 4:8). ఇదే పదము యొక్క మరొక రూపము, *paraklēotos*, పరిశుద్ధాత్మ (యోహాను 14:16, 26; 15:26; 16:7) మరియు యేసు (1 యోహాను 2:1), గూర్చి ప్రస్తావింపబడిన సందర్భములో ప్రయోగింపబడినది, తోడ్పాటునిచ్చునట్లు ప్రక్కలోనే నిలిచియుండు ఒక సహాయకుడని అర్థమై యున్నది.

## ఒనేసిముతో సంబంధమును ఏర్పరచుకొన్నాడు (4:9)

**9అతనితో కూడ నమ్మకమైన ప్రియసహోదరుడైన ఒనేసిమును మీ యొద్దకు పంపుచున్నాను; ఇతడు మీ యొద్దనుండి వచ్చినవాడే; వీరిక్కడి సంగతులన్నియు మీకు తెలియజేతురు.**

**"అతనితో కూడ నమ్మకమైన ప్రియసహోదరుడైన ఒనేసిమును, మీ యొద్దకు**
**పంపుచున్నాను, ఇతడు మీ యొద్దనుండి వచ్చినవాడే" (4:9)**

**ఒనేసిము** తుకికుతో కూడ ఉండినాడు. ఈ పేరు "లాభసాటియైన" లేక "ప్రయోజనకరమైన" అని అక్షరాలా అనువదింపబడినది. ఒనేసిము మునుపు పౌలునకును అతని యజమానునికిని "నిష్ప్రయోజనమైనవాడు" మరియు "లాభసాటికానివాడునై"

యుండెను కానీ ఇప్పుడు పౌలుకును అతని యజమానునికిని "ప్రయోజనకరమైనవాడు" మరియు "లాభసాటియైనవాడునై" యున్నాడని పౌలు వ్రాసినప్పుడు ఆయన శబ్దచమత్కారాన్ని ప్రయోగించియుండవచ్చును (ఫిలేమోను 11, 20). ఒనేసిము పేరు, ముఖ్యంగా దాసులలో, సర్వసామాన్యమైనదై యుండెను, అందువలననే ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రికలో చర్చింపబడిన ఆ దాసుడు ఒనేసిము మొదట ఫిలేమోనుకు సంబంధించిన దాసుడై యుండును ఏలయనగా పౌలు వ్రాసిన ఉత్తరములో ఫిలేమోను పేరు మొదట వ్రాయబడినది, మరియు ఉత్తరము ప్రాథమికంగా ఫిలేమోనుకు వ్రాయుటకు ఉద్దేశింపబడినదని సూచించుటకు ఇదొక సూచనయైయున్నది. ఫిలేమోను పత్రిక అప్పియకును అర్ఖిప్పునకును వ్రాయబడిన వాస్తవము ఆధారంగా, ఒనేసిము వారి దాసుడై యుండెనని కొందరు తర్కించారు (ఫిలేమోను వచనము 2).

తుకికు వలె గాక, ఒనేసిము పేరు ఎఫెస్సీయులకు వ్రాయబడిన పత్రికలో చేర్చబడలేదు లేక అతడు "దాసుడు" అని సంబోధింపబడలేదు (4:7; ఎఫెసీయులకు 6:21 చూడుము). అతడు సువార్త బోధకుడు కాదు మామూలుగా నమ్మకమైన ఒక క్రైస్తవుడై యుండుట - లేక అతడు ఇహలోక యజమానునికి ఒక దాసుడై యున్నాడని పరిగణించుటకు పౌలు ఆశించకపోవుట బహుశా ఇందుకు కారణమై యుండవచ్చును.

కొలొస్సయులు ఒనేసిమును 'పారిపోయిన ఒక దాసుడు'గా మాత్రమే ఎరిగియుందురు, ఒక క్రైస్తవుడుగా కాదు (ఫిలేమోను 10-20). అపనమ్మకమైన దాసుడై యుండిన ఒనేసిము, **నమ్మకమైనవాడును ప్రియ సహోదరునిగాను** మారిపోయాడని అతని గూర్చి పౌలు చేసిన ప్రస్తావన తెలియజెప్పినది, ఈ మాటలు అతనిని గౌరవపరిచాయి, ఏలయనగా పౌలు ఇతరుల గూర్చి ఉపయోగించిన అవే మక్కువగల మాటలను ఒనేసిము విషయములో కూడ ప్రయోగించాడు. యజమానులు మరియు స్వతంత్రులు వారి తోటి విశ్వాసులైన దాసుల యెడల కలిగియుండవలసిన ప్రేమ గూర్చి కొలొస్సయులకు ఉద్ఘాటించి తెలియజెప్పు నిమిత్తము పౌలు ఇలా చేసియుండును.

ఒనేసిము ప్రభువు నొద్దకు నడిపించినది పౌలే, పౌలు రోమాలోని చెరసాలలో ఉన్నప్పుడు ఈ కార్యము జరిగినది. "నా బంధకములలో నేను కనిన నా కుమారుడగు ఒనేసిము కోసరము నిన్ను వేడుకొనుచున్నాను" అను వాంగ్మూలము ద్వారా ఇది వాస్తవమని ఋజువగుచున్నది (ఫిలేమోను 10). ఒనేసిము ఆయనకు సహాయము చేయువాడుగా ఉండుట మంచిదని పౌలు కోరినప్పటికిని, వాని యజమాని అంగీకారము లేకుండా వానిని తన యొద్ద ఉంచుకొనుటకు సమంజసము కాదని పౌలు ఎంచి, ఒనేసిమును వాని యజమానుని యొద్దకు తిరిగి పంపించివేశాడు. పౌలు ఫిలేమోనుకు వ్రాసిన ఉత్తరములో, ఒనేసిమును ఒక దాసునిగా కాదు, కానీ ప్రభువు నందు ప్రియ సహోదరునిగా, ఆహ్వానింపవలసినదని ఆయన మనవి చేశాడు. ఏదైనా ఆర్థిక నష్టము కలిగియుంటే, అది ఒనేసిమును తీసికొనిన మొత్తము కావచ్చును లేదా అతడు హజరు కాకపోవుట వలన కలిగిన నష్టము కావచ్చును, దానిని తిరిగి చెల్లించుటకు పౌలు ఇష్టపడుచుండెను (ఫిలేమోను 18, 19). ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రిక భద్రపరచబడియుండుట ఒనేసిము స్వేచ్ఛాపరుడగునట్లు విడుదల గావింపబడి యుండునని సూచించును.

ఒనేసిము "నా కుమారుడు" నాకును "ప్రయోజనకరమైనవాడు," "నా

ప్రాణమువంటివాడు," "ప్రియ సహోదరుడు" అయియుండెనని ప్రకటించుట ద్వారాను, "నాకు పరిచారము చేయు నిమిత్తము నా యొద్ద అతని నుంచుకొనవలెనని యుంటిని" అని చెప్పుట ద్వారాను పౌలు ఒనేసిమును ఎంతగా ప్రశంసించాడో ప్రదర్శింపబడుచున్నది (ఫిలేమోను 10-13, 16). "నమ్మకమైనవాడును ప్రియ సహోదరుడును" అను పదజాలము కొలొస్సయులు ఒనేసిము యెడల ఇష్టపూర్వకమైన దృక్పథమును కనుపర్చుచు అతనిని వారి సహవాసములోనికి, పారిపోయిన ఒక దాసునిగా కాదు, కానీ క్రీస్తు నందు ఒక సహోదరునిగాను, ప్రేమపూర్వకంగాను ఆహ్వానించుటకు వారికి సహాయకరముగా ఉండినది. అతడు పారిపోయినవాడై యుండినప్పటికిని, ఇప్పుడు వారు అతనియందు నమ్మకముంచగలరు. దాసులు మరియు స్వతంత్రులు ఒకే రీతిలో దేవుని పిల్లలౌదురు (గలతీయులకు 3:26-28).

ఒనేసిము **వారి యొద్ద నుండి వెళ్లినవాడై** యుండెనని కొలొస్సయులు ఎరిగియుండిరని స్పష్టమగుచున్నది. పౌలు భావము ఇదే అయియున్నట్లయితే, ఫిలేమోను - ఒనేసిము యొక్క యజమాని, లేదా మునుపటి యజమాని - సహితము కొలొస్సయి నివాసియై యుండును. అయితే ఇది సరియైన సంగతి కాకపోయి యుండవచ్చును, ఏలయనగా ఫిలేమోను కొలొస్సయిలో నివసించుచుండినట్లయితే, పౌలు కొలొస్సయులకి తన అభివందనములు పంపినప్పుడు, అతని పేరు పెట్టి అతని గూర్చి పౌలు ఎందుకు ప్రస్తావించలేదు? ఆ రోజుల్లో పౌలు మిషనరీ ప్రయాణం చేయుచుండిన సందర్భములో, ఆయన ఫిలేమోనుకు వ్రాసిన వ్యక్తిగత ఉత్తరమును ఒనేసిము ఫిలేమోనుకు అందజేయుచుండెను గనుక పౌలు ఒనేసిము పేరు చేర్చలేదని కొందరనుకొనుచున్నారు.

### "వీరిక్కడి సంగతులన్నియు మీకు తెలియజేతురు" (4:9)

ఆయన కొలొస్సయులకు వ్రాసిన పత్రికతో పౌలు తుకికును పంపుటలో రెండు ఉద్దేశములుండినవి: పౌలు వ్రాసిన పత్రికను చదువువారిని ప్రోత్సాహించుట మరియు పౌలు పరిస్థితిని లవొదికయ, హీయెరాపోలి ప్రాంతంలోని సహోదరులకు తెలియజెప్పుట. ఆయన రోమా పట్టణంలో ఎలా జీవించుచున్నాడో, ఆయన పరిస్థితేమిటో వారు తెలియజెప్పుదురని చెప్పుచు, అపొస్తులుడు తన ఉత్తరమును మోసికొనివెళ్లుచుండిన వారి పేర్లను తన సహచరుల జాబితాలో మొదట పేర్కొన్నాడు. బహుశా, పౌలు చెరసాలలో ఉన్నాడని కొలొస్సయులు ఎరిగి యుందురు, కానీ ఆయన చెరసాలలో ఎలా ఉన్నాడో వారికి అంతగా తెలిసియుండదు. చెరసాలలో సహితము, పౌలు కనుపర్చిన ధైర్యము మరియు సాధించిన సఫలత గూర్చిన వార్త ఎంతో ప్రోత్సాహించినది. ఆయన పంపిన వార్తాహరులు బృహత్కార్యమేమైయుండినదో పౌలు ముమ్మారు ప్రకటించాడు. మొదటి, "తుకికు నన్ను గూర్చిన సంగతులన్నియు మీకు తెలియజేయును" (4:7) అని చెప్పాడు. ఆ తరువాత, "మీరు మా స్థితి తెలిసికొనునట్లును" అని చెప్పుచున్నాడు (4:8). మూడవ సారి, **వీరు** (తుకికు మరియు ఒనేసిము) **ఇక్కడి సంగతులన్నియు మీకు తెలియజేతురు** అని చెప్పాడు.

ఆయన పరిస్థితికి సంబంధించినంత వరకు పౌలు ఎట్టి సమాచారమునైను ఈ పత్రికలో వెల్లడించలేదు. చెరసాలలో నెలకొని యుండు పరిస్థితులు గూర్చిన వ్రాత మూలకమైన వర్ణన వలన చెరసాల అధికారులు పౌలు యెడల మరి ఎక్కువ కఠోరంగా వ్యవహరించవచ్చుననియు,

ఆయన ఉత్తరము దారిలో పట్టబడినట్లయితే అది ఆయన ప్రాణమునకు ముప్పు తెచ్చిపెట్టవచ్చుననియు కొందరనుకొనుచున్నారు. ఏదిఏమైనా, ఈ దృక్పథము నిరాధారమైనదై యున్నది ఏలయనగా పౌలు రోమా పట్టణంలోని చెరసాలలో చక్కగా చూచుకొనబడినాడు. "మేము రోమాకు వచ్చినప్పుడు పౌలు తనకు కావలియున్న సైనికులతో కూడ ప్రత్యేకముగా ఉండుటకు సెలవు పొందెను" అని లూకా రచించాడు (అపొస్తలుల కార్యములు 28:16). పౌలు రెండు సంవత్సరములు పూర్తిగా తన అద్దె యింట కాపురముండి, తన యొద్దకు వచ్చువారినందరిని సన్మానించి ఏ ఆటంకమును లేక పూర్ణ ధైర్యముతో "దేవుని రాజ్యమును గూర్చి ప్రకటించుచు, ప్రభువైన యేసు క్రీస్తు గూర్చిన సంగతులు బోధించుచు ఉండెను" (అపొస్తలుల కార్యములు 28:30, 31).

స్పష్టముగా, ఒక ఉత్తరములో చేర్చబడగల విషయాలను మించిన సంపూర్తి సమాచారమును కొలొస్సయులు పొందుకొనవలెనని పౌలు ఆశించాడు. వాగ్రూపమైన నివేదికను పూర్తిగా విన్న తరువాత, గ్రహీతలు పౌలు పరిస్థితికి సంబంధించిన ఇతర వివరాలు గూర్చి ప్రశ్నలడుగవచ్చును. పౌలు ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలో, ఆయన పరిస్థితి గూర్చిన సంగతులన్నియును తుకికు తెలియజేయునని ఆయన తెలియజెప్పాడు (ఎఫెసీయులకు 6:21).

ఆయన గృహనిర్బంధములో ఉండినందునుబట్టి, పౌలు పరిస్థితి ఆయన ఒక చెరసాలలోని చిన్న గదిలో ఉంచబడుట కంటె ఉత్తమంగా ఉండినది. తుకికు మరియు ఒనేసిము తెచ్చిన నివేదిక ద్వారా పౌలు చెరసాలలో భరించరానంతగా శ్రమననుభవించుచున్నాడని కొలొస్సయులు అనుకోకుండా వారి మనస్సులకు ఎంతో ఊరట కలుగును. ఈ వార్తహరులు పౌలు యెడల జరుగుచుండిన "యావత్తూ" (*panta*, "అంతటిని") – పౌలు అనుభవించుచుండిన ప్రతి విషయము కాదు, కానీ పౌలు పరిస్థితి గూర్చి వారు తెలిసికొనవలసినది "అంతా" – క్రైస్తవులకి తెలియజేయవచ్చును.

పౌలుకుండిన అధికారము లేక ప్రేరేపణ తుకికుకు గాని, ఒనేసిమునకు గాని లేకపోవుట, దేవుని ప్రత్యక్షత గూర్చిన వాగ్రూప నివేదికపై ఆధారపడుటకు బదులుగా పౌలు ఒక పత్రికను పంపుటకు గల హేతువై యున్నది. కొలొస్సయులకు తన సందేశమును వ్రాత మూలకంగా పంపగలగుటనుబట్టి వారు గైకొనుటకును మరలా సమాలోచన నిమిత్తము చూచుకొనుటకును వారికి కచ్చితమైన ఉపదేశము సమకూర్చబడినది. నిస్సందేహంగా, తదనంతర తరముల ఆధ్యాత్మిక శ్రేయస్సు కొరకు కొలొస్సీ పత్రికలో నున్న గొప్ప సందేశము నమ్మకముగా భద్రపరచబడుట, దేవుడు కోరినది కూడా అదే.

మనమడుగుటకు అవకాశము గల అసంఖ్యాకమైన ప్రశ్నలకు ఈ పత్రిక చివరి విభాగములో సమాధానమీయబడలేదు. ఉదా॥ ఫిలేమోను మరియు అప్ఫియ (ఫిలేమోను 1, 2) కొలొస్సీ పట్టణంలో, ఒనేసిము యొక్క మొదటి నివాస స్థలములో, నివసించియుండినట్లయితే, పౌలు తన అభివందన పలుకులను వారికి ఎందుకు పంపలేదు? మార్కు, కొలొస్సయుల నిమిత్తము ఎపఫ్రా సలిపిన పోరాటములు, నుంఫాను ప్రత్యేకముగా పేర్కొనుట, లవొదికయ వారితో ఇత్తరములను మార్పిడి చేసికొనుటను సమర్థించదగ్గ హేతువు, అర్ఖిప్పునకు ఇవ్వబడిన మందలింపునకు సంబంధించి పౌలు ఇచ్చిన ఆదేశములును మొదలగు విషయాల గూర్చి నేటి చదువరులు ఆశ్చర్యపడవచ్చును. ఈ సంశయాత్మక ప్రశ్నలన్నియును ఒక మర్మముగానే

మిగిలియున్నప్పటికిని, పౌలు పత్రికలను చదివిన తొలి చదువరులు పౌలు వారికి ఏయే విషయాలను ఉపదేశించుచుండెనో, వాటన్నిటిని వారు నిశ్చయంగా అర్థంచేసికొన్నారు.

## అన్వయము

**సహోదరులకు నివేదికను సమర్పించుట**

కొలొస్సయులకు వ్రాసిన పత్రికలో, పౌలు తన వ్యక్తిగత విషయాలను చేర్చలేదు. తుకికు మరియు ఒనేసిము కొలొస్సీ పట్టణము చేరుకొన్నప్పుడు, వారు పౌలు పరిస్థితులు మరియు కార్యకలాపముల గూర్చి నివేదించుదురు. వారు సంపూర్తి నివేదికను అందజేసెదరని పౌలు ఆధారపడదగిన తన వార్తాహరుల యందు సంపూర్ణ నమ్మకము కలిగియుండెను.

ఆయన ఎలా ఉన్నదీ, ఆయనకు ఏమేమి జరుగుచున్నదీ, మొదలగు విషయాలను కొలొస్సయులు తెలిసికొనవలెనని పౌలు ఎందుకు ఆశించాడు? అందుకు కొన్ని సంభావ్యమైన హేతువులున్నాయి. అవేవనగా, వారు ఆయన కొరకు ప్రార్థనలు చేయునప్పుడు వారి ప్రార్థన జాబితాలో ఏయే విషయాలను చేర్చవలెను, సువార్త వ్యాపకము పురోభివృద్ధి చెందుచుండుటనుబట్టి వారు ప్రోత్సాహింపబడవలెను, ప్రభువు నిమిత్తము వారు మరి ఎక్కువ కష్టపడి పనిచేయుటకు తన మాదిరి చేత ప్రేరేపింపబడవలెను, లేక దేవుని వాక్యము యొక్క సఫలతనుబట్టి వారు ఆయనతో కూడ ఆనందించవలనని ఆయన వారిని గూర్చి కలిగియుండిన ఆతురత, ఆయనకు అవసరమై యున్నట్లయితే, బహూశా వారు ఆయనకు కొంత ఆర్థిక సహాయమును సహితము అందజేయగలరు లేదా ఆయనను ప్రోత్సాహించు సమాచారములను ఆయనకు తెలియజేయగలరు. నేటి సంఘములు ఈనాటి వారి మిషనరీలతో సన్నిహిత సంబంధమును కలిగియుండుటకు ఇవి సహేతుకములైన సంగతులై యున్నవి.

ప్రేషితోద్యమ నివేదికలు ముఖ్యము. ఇతర క్రైస్తవులందరు మిషనెరీల పరిస్థితులను అర్థం చేసికొనవలెను, తమ్మునుతాము ప్రతిష్టించుకొనిన వారిని దేవుని సేవ కొరకై ఎంపికచేయవలెను.

*మిషన్స్ నివేదికలు సంఘములకు అందజేయబడవలెను.* సంఘ సభ్యులకు సమాచారమందించబడినట్లయితే, వారు మిషన్స్ గూర్చి యింకా ఎక్కువ ఆసక్తి చూపుదురు. ఎక్కడ ఏమిజరుగుచున్నదో వారు తెలిసికొందురు గనుక, ఆయా పనులు గూర్చి వారు ప్రార్థించుదురు మరియు మరియు దేవుని యెదుట ఏయే విషయాల గూర్చి మనవి చేయాలో గ్రహించుదురు.

పౌలు తన మిషనరీ ప్రయాణములు ముగించుకొని తిరిగి వచ్చినప్పుడు, ఆయన అంతియొకయకు, అనగా తన సువార్త ప్రకటన కార్యక్రమములను ఆరంభించిన చోటికి, చేరుకొనుచుండెను. పౌలు తన మొదటి మిషనెరీ ప్రయాణము ముగించుకొని వచ్చిన సందర్భము గూర్చి లూకా ఇలా వ్రాయుచున్నాడు, "వారు వచ్చి, సంఘమును సమకూర్చి, దేవుడు తమక తోడైయుండి చేసిన కార్యములన్నియు, అన్యజనులు విశ్వసించుటకు ఆయన ద్వారము తెరచిన సంగతియు, వివరించిరి" (అపొస్తలుల కార్యములు 14:27).

వారికి ఆర్థిక సహయమును అందజేయుచుండు దాతలు వారితో ఉత్తరప్రత్యుత్తరములు

జరుపకుండుటనుబట్టి కొందరు మిషనరీలు మరియు సంఘముల మధ్య సమాచారములు అందజేసికొనబడుచుండుట అత్యావశ్యకమై యున్నది, అప్పుడు వారు ఒకరితో మరొకరు వారి సంబంధములను కొనసాగించగలుగుదురు.

*మిషనరీల పనులను మరియు వారి పరిస్థితులను అర్థంచేసికొనుట మన ప్రథమ ప్రాధాన్యతయై యుండవలెను.* పనులు సక్రమంగా జరుగుచుండునప్పుడు, మిషనరీలు ఆయా పనులను ఇతరులతో పంచుకొనవలెనని ఆశిస్తారు. వారు కష్టనష్టముల నెదుర్కొనుచున్నట్లయితే, వారికి ప్రత్యేకమైన సహాయము మరియు ప్రోత్సాహము అవసరమై యుండును కానీ వారి కష్టములను వారు మనకు తెలియజేయకపోవచ్చును. బాధ్యతగల పోషక సంఘములు వారి మిషనరీలతో సమాచార సంబంధములను కొనసాగించుచుండవలెను.

*మిషనరీలు మరియు పోషక సంఘముల మధ్య ప్రయాణించుటకు నమ్మకమైన మరియు అంకితము చేసికొనిన వార్తాహరులు ఎంపిక చేయబడవలెను.* సాధ్యమైతే, చేయబడుచుండు పనులను పర్యవేక్షించునట్లును పనులు చేయుచుండు మిషనరీలను ప్రోత్సాహించునట్లును సంఘ పెద్దలు కొందరిని కనీసము సంవత్సరమునకు ఒక పర్యాయమైనా పంపించవలెను. ఉత్తరములు, టెలీఫోన్ కాల్స్, మరియు ఇ-మెయిల్స్ ద్వారా పంపబడు సందేశములు సహాయకరముగా నుండును, ఆయితే ఇవి క్షేత్రములోని మిషనరీలను స్వయముగా సందర్శించుటకు ప్రత్యామ్నాయములు కావు.

కొలొస్సయులకు వ్రాసిన పత్రికలో పౌలు తన పరిస్థితులను వర్ణించగలిగి యుండెను, కానీ ఒక కాగితముపై లిఖంపబడు మాటలు, నోటితో చెప్పబడు మాటలు ఉన్నంత అర్థవంతమైనవై, భావప్రకాశమైనవై యుండవు. సంక్షిప్తముగా నుండు నివేదిక వ్యక్తిగతముగా నివేదింపబడుదానంత ఆసక్తికరంగా లేక సంపూర్ణమైనదిగా ఉండదు. అంతమాత్రమేగాక, పనులు గూర్చిన సమగ్రమైన నివేదిక నిమిత్తము వార్తాహరులను ప్రశ్నించవచ్చును.

సహోదరులకు నివేదించుటకు సంబంధించినంత వరకు దానికి లేఖనానుసారమైన ప్రాధాన్యమున్నది గనుక పోషక సంఘములు మరియు పోషింపబడు మిషనరీల మధ్య నుండు ఒక ఆరోగ్యకరమైన సంబంధము నిమిత్తము అది ప్రాణాధారమైనంత ప్రాముఖ్యమైనదై యున్నది. పరప్రాంతముల నుండి తెలియజేయబడు శుభవర్తమానము వలన దాతలు ప్రయోజనము పొందుకొందురు, వారి కొరకును వారి పనుల కొరకును ప్రార్థించుచుండు విశ్వసనీయమైన సోదరసోదరీమణులున్నారని తెలిసికొనుట వలన మిషనరీలు బలము పుంజుకొందురు.

**తుకికు, ప్రశంసనీయమైన తోటిపనివాడు (4:7-9)**

తుకికు కలిగియుండిన ప్రత్యేక లక్షణములు, క్రైస్తవులందరిలోను ఉండవలెనని కోరబడుచున్న స్వభావమును ఉదాహరణంగా వర్ణించుచున్నవి. మనము ఇతరులతో కలిసి క్రీస్తు కొరకు పనులు చేయునప్పుడు, పౌలు తుకికును దృష్టించినట్లే మనము మన జతపనివారి చేత దృష్టింపబడుటకు తగినట్లు మనము జీవించవలెను. ఇంకా, మనము మన జతపనివారిలో మంచి గుణములు గమనించినప్పుడు, పౌలు వలెనే మనము వారిని ప్రశంసించవలెను. పౌలు తుకికును ప్రస్తావించిన విధములను గమనించుము:

*"ప్రియ సహోదరుడు."* క్రైస్తవులు కలిసికట్టుగా నుండునట్లు ప్రేమ చేత

బంధింపబడినవారై యుండవలెను. ప్రభువునందు విశ్వసనీయమైనవారుగా జీవించువారు ప్రేమ మరియు మర్యాదకు అర్హులై యున్నారు. కొన్ని పర్యాయములు సేవ చేయుటకు వెదుకువారు అసూయను బట్టి ఇతర పనివారిని ప్రేమించుటలో విఫలులౌదురు. ఇది ఎన్నడునూ జరుగకూడదు, ఏలయనగా ఇటువంటి భావోద్రేకములు పోటీతత్వమును మరియు కలహమును కనిపెంచును.

*"నమ్మకమైన దాసుడు."* యేసుతో నుండు నూతన జీవము యొక్క నిరీక్షణ (1 కొరింథీయులకు 15:19, 20, 58), పరలోకమందలి నిత్యజీవము (1 పేతురు 1:3, 4), మరియు యేసును పోలియుండునట్లు రూపాంతరము చెందుట (1 యోహాను 3:2, 3). మొదలగు హేతువులనుబట్టి యేసు యెడల మరణము వరకు యథార్థమైనవారుగా నిలిచియుండువారు నమ్మకమైన క్రైస్తవులై యున్నారు (ప్రకటన 2:10). ఒకడు చిత్రహింసలను, నిరుత్సాహమును, అవిశ్వాసులైన సహోదరులను, లేదా అపవాది నుండి శోధనలను ఎదుర్కొనినప్పుడు యథార్థమైన సుస్థిరత్వము కడతేర్చబడజాలదు.

*"కట్టుబడియుండిన తోటి దాసుడు."* పాపము చేయువారు పాపమునకు దాసులై యున్నారు, కానీ వారు యేసుకు విధేయులగుట ద్వారా నీతికి దాసులౌదురు (రోమీయులకు 6:17, 18). క్రీస్తు దాసులు సామరస్యముతో సంయుక్తమై దేవుని సేవలోని పనులు చేయుచుండవలెను. నేటి క్రైస్తవులు యేసు నిమిత్తము పౌలు మరియు తుకికుల మధ్య నెలకొని యుండిన సామరస్యమును మాదిరిగా అనుసరించవలసినవారై యున్నారు.

నమ్మకమైన వార్తాహరునికి తుకికు ఒక మంచి మాదిరియై యున్నాడు. అతనిని ఒక నమూనాగా పెట్టుకొని, క్రైస్తవులు ఈ క్రింది పనులు చేయుటకు ప్రయాసపడవలసి యున్నదని మనము గమనించుచున్నాము:

(1) నమ్మదగినవాడనై యుండుము. పౌలుకు సంతోషము కలుగజేయుచు సంతృప్తినిచ్చు విధముగా తుకికు పౌలు పరిస్థితిని గూర్చి సమగ్రముగా నివేదించగలడని పౌలు తుకికును నమ్మాడు. ఇతరుల పక్షముగా మాటలాడువారు వారు చెప్పునది కచ్చితమైనదని వారు రూఢిపర్చుకొనవలెను. అబద్ధపు నివేదికలు పరువుప్రతిష్టలను నాశనము చేయుచు, సంఘములకు హానికలుగజేయునవగును. అప్పుడప్పుడు, క్రైస్తవులు వారికి తెలిసిన ప్రతి విషయమును (అది నిజమే అయినప్పటికిని) తెలియజెప్పకుండునట్లు నిగ్రహించుకొనవలెను. "సహోదరులారా, ఒకనికి విరోధముగా ఒకడు మాటలాడకుడి" అని యాకోబు రచించాడు (యాకోబు 4:11).

ఇతరుల గూర్చి, ముఖ్యముగా తోటి క్రైస్తవుల గూర్చి, మనము నోరు తెరచి మాటలాడక మునుపు మనలను మనము ఈ క్రింది ప్రశ్నలు వేసికొందాము:

"అది నిజమేనా?"
"అది దయగల విషయమేనా?"
"అదే విషయం పునఃరుచ్చరింపబడవలెనని నేను కోరుదునా?"
"అది సహాయకరమైనదా లేక హానికరమైనదా?"
"అదే విధముగా ఇతరులు నన్ను గూర్చి ముచ్చటించుకొనవలెనని నేను కోరుదునా?"
"నేను చెప్పబోవుచున్న దానిని యేసు యెదుట తీర్పు దినాన సమర్థించగలనా?"

(2) ప్రోత్సాహించువాడవై యుండుము. ఇతరులను ప్రోత్సాహించు సామర్థ్యము తుకికు కలిగియుండెనో లేదో ఎక్కువగా తెలియదు. ఇతరులను ప్రోత్సాయించుటకు ఒకడు కలిగియుండిన సామర్థ్యమునకు ఒక క్రైస్తవుడుగా పేరు ప్రఖ్యాతులుగాంచిన వానికి బర్నబా ఒక మంచి ఉదాహరణమై యున్నాడు. ఇందువలననే అపొస్తులుడు ఈయనకు "హెచ్చరిక పుత్రుడు" అని పిలుచుచున్నాడు (అపొస్తలుల కార్యములు 4:36). పౌలు గూర్చి తగు శ్రద్ధ వహించి మిగిలిన అపొస్తలులు ఆయనను చేర్చుకొనునట్లు వారిని ఒప్పించినది ఈయనే (అపొస్తలుల కార్యములు 9:27). అంతియొకయలో జరుగుచుండిన సేవలో సహాయము చేయుటకు అపొస్తలులు బర్నబాను ఎంపిక చేసికొనిన తరువాత, పౌలును కూడ చేర్చుకొని పని కల్పించినది ఈయనే. అటుతరువాత, మార్కును ప్రభువు నిమిత్తము ఒక ప్రయోజనకరమైన పనివానిగా తీర్చుదిద్దుటలో ఆయన తోడ్పడ్డాడు (2 తిమోతి 4:11).

(3) నమ్మకమైన జతపనివాడవై యుండుము. తుకికు మరియు ఒనేసిము ఒక మంచి జట్టుగా తయారై యుందురు. ఒనేసిము ఒక దాసుడై (కట్టబడియుండిన బానిస) యుండినప్పటికిని ఈ ఇరువురును కలిసి పనిచేయగలిగారు. ఒకరొకరి నేపథ్యములు మరియు సమాజములోని స్థానములేవై యున్నను, ప్రభువు నిమిత్తము కలిసి పనులు చేయుటకు క్రైస్తవులు నేర్చుకొనవలెను. ఆయన అనుచరులు ఆయనకు ఆయనను పోలినవారై తోటి విశ్వాసులతో కలిసి సామరస్యముగా పనులు చేయుచుండునట్లు యేసు తన అనుచరులను రూపాంతరము చేయగలడు.